

# డాక్టర్ చెప్పిన కథలు

## – డా.శైలజ చందు



## - 23 -

**మా యూనిట్ లో** ఒకావిడను ఎడ్మిట్ చేశాము. యాభై అయిదు అరవై ఏళ్ళ మధ్య ఉండొచ్చు .

వివరాలు కనుక్కుంటే, ఆమెకు పెళ్ళి కాలేదట. దగ్గరి బంధువులూ ఎవరూ లేరు. ప్రభుత్వం వారు నిర్వహించే వృద్ధాశ్రమం లో ఉంటుందని చెప్పారు.

ఒక వయసు దాటిన తర్వాత ఆడవారికి ఎదురయే గైనిక్ సమస్య అమెకుండడం వల్ల, గర్భాశయం తీసెయ్యాలని నిర్ణయించాము. ఆమెకు ఆపరేషన్ విషయం చెప్పి , అనుమతి తీసుకుందామనుకుంటే, నేను గానీ, తోటి డాక్టర్లు, నర్సులు గానీ చెప్పే విషయం, ఆమెకేమైనా అర్థం అవుతోందా అన్న అనుమానం వచ్చింది. మనిషిని చూస్తే ఎక్కడో ఏదో ఏదో లోకం లో ఉంటుంది.

నేను మాట్లాడడం మొదలు పెట్టాక ఒకటి రెండు క్షణాలు నా వంకచూస్తుంది. 'పర్లేదు ఈమెతో నేనేదైనా చెప్పగలను అనుకునే లోపలే చూపు ఎటో తిప్పి కిటికీ వంక చూస్తూ ఉంటుంది. ఏదడిగినా మాట్లాడదు. చెప్పదు. బట్టలు సవరించుకుంటూ కూర్చుంటుంది.

మానసిక వైద్యుల్ని పిలిపించాం కానీ, ఆమె వాళ్ళతో కూడా ఏమీ మాట్లాడలేదు.

ఎవరూ లేని కారణం వల్ల ఆపరేషన్ కు కావలసిన అనుమతి కోసం ప్రభుత్వానికి అప్లై చేశాము. ఆ పర్మిషన్ రావడానికి కొంత సమయం పడుతుండగా, ఆమెను మళ్ళీ హాస్టల్ కు పంపించవద్దనీ, ఆపరేషన్ అయి, కోలుకునే వరకూ వార్డ్ లోనే ఉంచమనీ చెప్పాను.

అన్నిటికన్నా పెద్ద సమస్య ఏమిటంటే, హాస్పిటల్ లో చేర్చాక అది మూడో రోజు. మూడు రోజుల్నుండీ ఏమీ తినకుండా కూర్చుంది. ఆరోజు ఆపరేషన్ కు పైనుండి పర్మిషన్ వస్తుంది. కనీసం ఒక్క రోజైనా ఆమె ఏదైనా తీసుకుంటే , ఆ తర్వాత రోజు సర్జరీకి పోస్ట్ చెయ్యొచ్చు అనుకున్నాను. హాస్పిటల్ ఫుడ్ తినలేకపోతోందని, మంచి రెస్టారెంట్ నుండి ఏవేవో తెప్పించాము. వాటి వంక కన్నెత్తి కూడా చూడలేదు.

"ఆపరేషన్ ముందు రాత్రి నుండీ తినకపోతే చాలు మామ్మా, మూడు రోజులక్కర్లేదు." వేళాకోళంగా అన్నారు మా నర్సులు.

పేషంట్ మాత్రం వాళ్లమాటలకూ తనకూ ఏమీ సంబంధం లేనట్లే చూస్తూ కూర్చుంది.

"నవ్వులాటలు ఆపి, ఆమె తినేలా ఏదైనా చెయ్యండి."

నా పక్కనున్న నర్సులతో చెప్పాను.

"తినిపించడం , తాగించడం, పేషంట్లను ముద్దు చెయ్యడం మీ బెస్ట్ ఫ్రెండ్ కే తెలుసు మేడం."

"సరే , తనని పిలిపించండి. ఇవాళ ఎలాగైనా పేషంట్ తో ఏదో ఒకటి తినిపిస్తే తప్ప ఎవరికీ లంచ్ బ్రేక్ లేదు అని పక్క బెడ్ కు వెళ్ళాను.

ఆ పేషంట్ పేరు మరియం.

నర్సులు ఎవరికో ఫోన్ చేస్తే, నా బెస్ట్ ఫ్రెండ్ వచ్చింది. పేషంట్ ని చూసింది. ఒక అరగంట లో వస్తానని , పర్మిషన్ తీసుకుని వెళ్లింది. ఆమె కోసం ఎదురు చూస్తూ ఉన్నాం.

ఆమె వచ్చేలోగా ఒక కథ చెప్పనా...

లిల్లీ నల్లగా ఉంటుంది.

అవును , పశ్చిమ గోదావరి జిల్లాలోని ఒక పల్లెటూర్లో పుట్టి పెరిగిన లిల్లీ నల్లగా ఉంటుంది.

చాలా ఏళ్ల క్రితం ఆ ఊళ్ళో పనిచెయ్యడానికి ఒక ఆంగ్లో ఇండియన్ నర్స్ వచ్చింది. ఆమె చేతుల్లో పుట్టిన తన చిన్న కూతురికి, ఆ నర్స్ పేరే పెట్టుకున్నాడు నరసింహులు. ఆమె మనుషులపట్ల ఎలా ప్రేమగా ఉండేదో, ఎంత దయ చూపేదో చిన్న తనం నుండీ వినీ వినీ, లిల్లీ తను కూడా నర్స్ కావాలని అనుకునేది.

ఆమె కావాలనుకున్నట్లే ఆమెను నర్సింగ్ లో చేర్పించాడు నరసింహులు.

అతనికి తండ్రి కట్టించిన ఇల్లుంది. తన వాటాకొచ్చిన పొలం ఉంది. పొలం మీద అప్పు ఉంది. పెద్ద కూతురికి పెళ్ళి చేశాక ఆ అప్పు మరింత పెరిగింది.

నర్సింగ్ పాసై, ఇంటికి రాబోయే ముందు, తనతో బాటు చదువుకున్న కేరళ అమ్మాయిలు గల్ఫ్ దేశాల ఇంటర్వ్యూలకు వెళ్తుంటే, వాళ్ళతో కలిసి తను కూడా వెళ్ళింది. ఉద్యోగం కూడా వచ్చింది. మనదేశంలో వచ్చే జీతం తో పోలిస్తే చాలా ఎక్కువ. కానీ తనని వంటరిగా వేరే దేశానికి పంపించడం తలిదండ్రులకిష్టం ఉంటుందో లేదోనని ఉద్యోగం వచ్చిన విషయం దాచి పెట్టింది.

ఇంటికెళ్ళి చూస్తే, పరిస్థితి ఏమీ బాగోలేదనిపించింది. వ్యవసాయం కోసం చేసిన అప్పులు, అక్క పెళ్ళికోసం చేసిన అప్పులు కనిపించాయి. ధరలేక ఇంటిముందు కుప్పబోసిన కాయలు. వాటినెక్కడ పారెయ్యాలోనని అమ్మా నాన్నలు చర్చించుకుంటున్నారు.

ఇంటికి వచ్చిన దగ్గర్నుండీ, రోజంతా ఒకే ఆలోచన, ఉద్యోగం వచ్చిన సంగతి ఎలా చెప్పాలా, అమ్మానాన్నల్ని ఎలా ఒప్పించాలా అని.

కూతురెప్పుడూ ఆలోచనల్లో మునిగి ఉండడం చూసింది తల్లి. పిల్ల మనసులో ఎవరైనా ఉన్నారేమో, ఆ విషయం తమతో ఎలా చెప్పాలోనని ఆలోచిస్తోందనుకుంది.

“అక్క పెళ్ళి అయింది. నీ పెళ్ళి కూడా చేస్తే ఒక పని అయిపోతుంది.”

“పెళ్ళా? పెళ్ళేమిటి? నేను ఉద్యోగం చెయ్యాలి.”

“ఏ వూళ్ళో కుదురుద్దో సమ్మంధం? ఆళ్ళకిష్టమైతే చేద్దువుగానిలే. ”

“కాదు కాదు. నేను ఉద్యోగమే చేస్తా.”

రాత్రి భోజనాలయ్యాక, వరండా మెట్ల మీద కూర్చుంది. చలి తగ్గుతోంది. ఆరు బయట మంచం మీద పడుకుని తండ్రి ఆకాశం వంక చూస్తున్నాడు.

ఎప్పట్లానే చుక్కలు, చంద్రుడు భూమ్మీద మనుషులేం చేస్తున్నారో చూసేందుకొచ్చారు

“నాన్నా” పక్కనే కూర్చుంది. ఏదో చెప్పడానికి వచ్చిందని,

“చెప్పు.”

“నాన్నా , నేను ఉద్యోగానికెళ్తాను.”

“అలాగే.” ఇంకా ఆకాశం వంకే చూస్తున్నాడు.

“నాకు ఉద్యోగం వచ్చింది.” ఉద్యోగం ఎక్కడో , జీతం ఎంతో చెప్పింది.

నర్సింహులు లేచి కూర్చున్నాడు.

“ఎడారి దేశానికి ఒంటరిగా వెళ్తావా? వద్దు.”

“నాతో చదువుకున్న అమ్మాయిలు చాలా మందే వెళ్తున్నారు నాన్నా.”

ఆయన మౌనంగా ఉన్నాడు.

“ఎలా నాన్నా మరి . ఈ అప్పులెలా తీరుస్తావు?”

“పొలం అమ్మేసి నీ పెళ్ళి చేస్తాను. పడుకో.” ఇక మాట్లాడేదేమీ లేదన్నట్టు పడుకున్నాడు.

లిల్లీ తల్లి పక్కన పడుకుంది. కొన్ని సార్లు పడుకోవడం అంటే రాని నిద్ర కోసం ప్రయత్నం చెయ్యడం.

ఉదయాన్నే నిద్రలేచి తయారయి కూర్చుంది. తల్లి దండ్రులని ఎలా ఒప్పించాలోనని ఆలోచిస్తూ బంతిపూల మొక్కల మధ్య తిరుగుతోంది.

చిన్ని చిన్న మొక్కలకు కాసిన నల్లని వంకాయల్ని , నూగుతో మెరుస్తున్న బెండకాయల్ని చూస్తోంది.

ఎవరో వచ్చినట్టనిపిస్తే గేటు వైపు చూసింది.

చేపలమ్మే సుబ్బులొచ్చి ఇంటి ముందు చేపలతట్ట దింపి కూర్చుంది.

“అబ్బా, చేపల వాసన. మాకేం వద్దు సుబ్బులూ.” ముక్కు చిట్లిస్తూ చెప్పింది లిల్లీ.

“నేనే రమ్మన్నానులే” అంటూ తల్లి బయటికి వచ్చింది.

బుట్ట లో చేపలు ఇంకా ప్రాణం ఉన్నట్టు అప్పుడప్పుడు కదుల్తున్నాయి.

"ఎందుకమ్మా ఇవి, మనింట్లో ఇన్ని కూరలు పెరుగుతుంటేనూ, ఏ వంకాయలో, బెండకాయలో వండొచ్చు కదా." బుట్ట లో కదులుతున్న వాటి వంక అయిష్టంగా చూస్తూ అంది.

“ఇవాళ అక్కోళ్ళొస్తున్నారే.” చేపలెందుకు కొంటోందో కారణం చెప్పింది తల్లి.

ఓ గంట తర్వాత అక్కా, బావా వచ్చారు.

ఎర్రటి చీర కట్టుకుంది లిల్లీ అక్క . మెడలో మూడు చిక్కుపడిన హారాలున్నాయి. మూడింటిలో రెండు పెళ్ళికి సంబంధించినవి. చెవుల నుండి తలలోకి పాకుతున్న గొలుసులు, నడినెత్తి నుండి వేలాడుతున్న డిసెంబర్ పూల మాల. నిండుగా పసుపు రాసిన కాళ్లకు గజ్జెల పట్టీలు!

తమ ఇంట్లో పుట్టి పెరిగిన అక్కేనా అని అనుమానం వచ్చింది లిల్లీకి.

అక్క భర్త పొడుగ్గా, తెల్లగా ఉన్నాడు. తెల్లటి పాంట్ మీద, గులాబీ రంగు చారల చొక్కా వేసుకున్నాడు. బస్ దిగి ఇంటివరకు నడచి వచ్చేసరికే అలిసిపోయినట్టున్నాడు. వంటి మీదున్న చొక్కా అక్కడక్కడా తడిసి పోయి ఉంది.

అల్లుడికి మర్యాద చేసి, కూర్చోబెట్టి ఫాన్ వేశారు. ఇంటి వద్ద అందరి కుశలమూ కనుక్కున్నారు. పెరుగుతున్న ఎండలకు కొంచం నొచ్చుకున్నట్టు మాట్లాడారు.

అవీ ఇవీ మాట్లాడుకున్నాక, లిల్లీ పెళ్ళి సంగతి అడిగాడు అతను.

“లిల్లీకి పెళ్ళి చెయ్యరా?”

“చిన్నపిల్లే కదా బాబూ.”

“ఉమ కూడా చిన్నపిల్లే కదా.” భార్య వంక చూసి నవ్వాడు. గడపలో నిల్చున్న అక్క సిగ్గుపడింది.

లోపలికెళ్ళడం ఇష్టం లేనట్టు ఇంకా గడపలోనే నిలబడి భర్త వంక చూస్తోంది.

“మా బాబాయి కొడుకున్నాడు. కానిస్టేబుల్ గా చేస్తున్నాడు. కాకపోతే, కొంచం పట్టింపులెక్కువ. చదువుకున్న పిల్ల వద్దన్నారు. మీకిష్టం లేకపోతే ఇంటిదగ్గరే ఉంటుందని చెప్పాను.”

సంబంధం గురించి ఇంకా చెప్తున్నాడు.

చెల్లెలికి సంబంధం చూస్తున్నందుకు, తమ కుటుంబ బాధ్యతలు తనవిగా అనుకుంటున్నందుకు లిల్లీ వాళ్ళ అక్క ఎంతో సంతోషపడింది. వాళ్ళొచ్చిన అరగంటలోనే భర్తకు తినిపించాలని, తాగించాలని, మర్యాదలకు లోటు రాకూడదని హడావుడి పడుతోంది.

లోపలికెళ్ళినట్టే వెళ్ళి కాఫీ తెచ్చి అతనికిచ్చింది. చెయ్యి చాపి కాఫీ అందుకుంటుంటే లిల్లీ అతని చేతి వంక చూసింది. చేతి నిండా దారాలు. కాశీ దారాలు, ఎర్రదారాలూ.

“లిల్లీ పేరు కూడా బాగోలా. మారిస్తే నయం ” కొత్తల్లుడు అభిప్రాయపడ్డాడు.

మంచి సంబంధం రావాలి గానీ, పేరు మార్చుకోడానికేముంది?

లాటరీ తగిలిన టికెట్ కొనేందుకు, రూపాయి ఖర్చు పెట్టడానికి వెనకాడతారా ఎవరైనా?

“రష్మిక అని పెట్టుకోవే. మొన్న మా ఆడపడుచు కూతురికోసం అనుకున్నాం కానీ, ‘నే’ అక్షరం మీదే రావాలన్నారు. అందుకని నేత్ర అని పెట్టాము. నచ్చిందా పేరు?”

లిల్లీ వెనకే నిల్చుని, ఆమె భుజం మీద గడ్డం ఆనించి అడిగింది అక్క.

ప్రయాణం లో అలిసిపోయిన అల్లుణ్ణి పడుకోమని చెప్తే , నిద్రపోడానికి లోపలికి వెళ్ళాడు.

తల్లి చేపల్ని శుభ్రం చేస్తుంటే, పెద్దకూతురు పక్కనే నిలబడి.

"అమ్మా ఆయనకు ఫ్రై అంటేనే ఇష్టం." చెప్పింది.

లిల్లీ వంక తిరిగి “చేపలు తోమరాదే? నువ్వింక అన్నీ నేర్చుకోవాలి. మా మరిది పక్కా నాన్ వెజిటేరియన్"

"పక్కా, తొక్కా? నేను చచ్చినా చేపని ముట్టుకోను."

"పెళ్లయాక నువ్వే వండుతావు. నేను చూడనా." చెల్లెల్ని చూసి నవ్వి , ముద్దుగా తలమీద కొట్టి లోపలికి వెళ్ళింది.

ఇదివరకు అక్కా చెల్లెళ్లకు ఒక్క క్షణం పడేదికాదు. గొడవలు పడుతూనే ఉండేవాళ్ళు. అక్క చిందించే ఈ సామరస్యపు నవ్వుల కన్నా ఆ తగాదాలే నయమనిపించింది.

తల్లి క్షణం తీరిక లేకుండా పనిచేస్తూనే ఇంది. భోజనాలు అయిన గంటకే, పకోడీలు. టీ ఇచ్చిన రెండు గంటలకే , రాత్రి భోజనాలు.

స్వీట్లనీ, బజ్జీలనీ, ఇంకోటనీ పొద్దుణ్ణుండీ పొయ్యికి విశ్రాంతి లేదు.

అలుపు లేకుండా అక్క కూడా సందడి చేస్తోంది. అయిన దానికీ కానికీ, భర్త మీద అలుగుతోంది.

"చూడమ్మా ఈయనా" అంటూ తల్లికి ఫిర్యాదులు చేస్తోంది. గారాబాలు పోతోంది. భార్య అలకల అల్లరిని పూర్తి స్థాయిలో ఆస్వాదిస్తున్నాడు చారల చొక్కా అల్లుడు.

కొంత సేపటికి హఠాత్తుగా తన పెద్దరికం గుర్తొచ్చి చెల్లి పెళ్ళి మాటలు మాట్లాడుతోంది.

“మంచి సంబంధం నాన్నా. ఈయనంత కాదు గానీ అబ్బాయి తెల్లగానే ఉంటాడు. మంచి ఫామిలీ. అస్సలు ఆడాళ్ళని బయటికి పంపించరు. పెళ్ళీ పేరంటాలకు తప్ప, ఆడాళ్ళు బయటికెళ్ళాల్సిన పనిలేదు.” చెల్లెల్ని వాళ్ళు ఒప్పుకోవడం ఎంత అదృష్టమో వివరిస్తోంది.

తనెంత చెప్పినా సరే సంబంధం పట్ల ,తల్లితండ్రులు పెద్దగా ఉత్సాహం చూపనందుకు ఆమెకు అసహనంగా ఉంది.

“దాని రంగుకు వాళ్లసలు చేసుకుంటాననడమే ఆశ్చర్యం” చిరాకు అణుచుకోలేక అంది.

అక్క మాటలు వింటున్న లిల్లీ ఒక సారి తలిదండ్రుల ముఖాల వైపు చూసింది. ఇద్దర్నీ చూస్తుంటే దిగులయ్యింది. జాలి వేసింది.

ఎక్కడికీ వెళ్ళాల్సిన అవసరం లేనప్పటికీ , నడుచుకుంటూ బయటికి వెళ్ళింది. వెంకాయమ్మ గారి కూరగాయల తోట వరకూ నడిచి వెళ్ళింది. దడి మీద కాసిన చిన్ని చిన్ని కాకరపిందెల్ని తడిమింది. పసుప్పచ్చ కాకరపువ్వుల్ని వాసన చూసింది. పగలు పూసే పూలకు వాసన బాగుండదని మనసులోనే అనుకుంది.

బావకు కాఫీ ఇస్తున్న అక్క గుర్తొచ్చింది.

ఆ సిగ్గు, నంగి నవ్వులు.

‘పెళ్ళంట పెళ్ళి. ఛీ నాకు పెళ్ళొద్దు . వద్దంటే వద్దు.’ అనుకుంది

నాన్నతో గట్టిగా చెప్పాలని అడుగులు వేస్తూ ఇంటివైపు నడుస్తోంది.

“ భూమి సొట్ట పడుద్దేమో పిల్లా. మెల్లగా నడువు ” ఎదురుగా వచ్చే రత్తాలు చెప్పింది.

ఇంటికి వెళ్ళే సరికి ఇల్లంతా సర్దుతూ కనిపించింది తల్లి.

“ఎక్కడికి వెళ్ళావే . అక్కా బావా నీ కోసం చూసి చూసి వెళ్ళిపోయారు.”

“అమ్మయ్య, వెళ్లారా?”

“ఏమ్మాటలే ? పెళ్ళి టైముకు ఒళ్ళు చెయ్యాలంట. రంగు రావడానికి క్రీమేదోరాసుకోమని మీ అక్క మరీ మరీ చెప్పి వెళ్ళింది.”

“ఛీ..ఛీ. నేను పెళ్ళి చేసుకోను.”

“ఇలా అన్నవాళ్ళని చాలా మందినే చూశాను.”

ఇల్లు సర్దేసి పడుకోవడానికి వెళ్ళింది. అక్కా వాళ్ళున్న మూడురోజులూ, తల్లి నిద్రపోవడం చూడలేదు. ఆమె నిద్రపోతుంటే, దగ్గరగా వెళ్ళి చూసింది. ఊపిరి పీలుస్తుందా లేదా అని.

తండ్రి దగ్గర కూర్చుని మెల్లగా మాట్లాడుతోంది.

“నాన్నా, నేను ఉద్యోగానికి వెళ్లాల్సిందే.”

లిల్లీ వంక చూశాడు.

“నాకా చెత్త పెళ్ళి చేశావో.. చూడు నీతో ఎప్పటికీ పలకను. పారిపోతాను.”

వేలితో తండ్రిని బెదిరించింది.

కూతుళ్ళని ఎంత ప్రేమగా పెంచుకుంటే , వాళ్ళ బెదిరింపులకు అంత భయపడాలి.

‘ఆడపిల్లకు పెళ్ళిచెయ్యకుండా, ఎక్కడికో ఉద్యోగానికి పంపడం, తండ్రిగా బాధ్యత లేనట్లు’ అనుకుని కూతురి వంక దిగులుగా చూశాడు నర్సింహులు.

తండ్రి మొహం చూస్తే జాలేసింది.

'పాపం, తనని బాధ పెట్టలేదు. పంపించలేదు. అయినా సరే వెళ్ళాలి. తండ్రికిన్ని కష్టాలుండకూడదు.'

"ఏం భయం ఉండదు నాన్నా. నా ఫ్రెండ్స్ అంతా వెళ్తున్నారు. అక్కడ నాకొచ్చింది, గవర్నమెంట్ ఉద్యోగం. ఏం భయముండదట. ఫ్రెండ్ వాళ్ళ పిన్ని సునీత అక్కడే పనిచేస్తుంది కదా. ఆమె ఇండియా వచ్చింది. మళ్ళీ తిరిగి పదహారో తారీకు తిరిగి వెళ్తుందంట. ఆమెతో కలిసి వెళ్తాను."

"అప్పులు తీర్చుకుందాం నాన్నా. ఆ తర్వాత పొలం , వ్యవసాయం నీ ఇష్టం. చేస్తే చెయ్యి, లేకపోతే లేదు. ఇక అప్పులు చెయ్యొద్దు నాన్నా."

పెరిగిన గడ్డం పట్టుకుని బతిమలాడుతోంది.

కొన్ని నిర్ణయాలు ఇష్టం ఉన్నా లేకపోయినా జరిగిపోతుంటాయి. చూస్తూ ఉండాలి తప్ప ఇంకేమీ చెయ్యలేము. పిల్లలు నచ్చిన వైపు అడుగులు వేస్తామంటే ఆపలేము.

వాళ్ళ మీద ప్రేమతో నూ, ఆపితే బాధపడతారన్న భయంతోనూ !

"ఆ పెళ్ళి కూడా నాకొద్దు నాన్నా. ఆ అల్లుళ్ళు, ఆ మర్యాదలు, నాకొద్దు." మొహంలో అయిష్టమంతా మొహం లో కనిపించింది.

ఆ క్షణంలో 'పాపం ఈ పిల్లకు పెళ్ళిచేయడమేంటి' అనిపించింది నర్సింహులికి

మనమున్న చోటికి ఆహారం రాదు.

అదున్నచోటికి పోతే వలస అంటారు.

మొదటి సారి ఎయిర్ పోర్ట్ అంతా కొత్తగా ఉంది.కూతురితో బాటు లోపలికి వెళ్ళబోతుంటే తండ్రిని ఆపేశారు.

ఎయిర్ పోర్ట్ నిండా ఎంతో మంది మనుషులు . ఎవరి లోకంలో వాళ్ళున్నారు. ఒకరి గొడవ ఇంకొకరికి పట్టదు.

"సునీత గారెవరో వస్తారన్నావు కదమ్మా."

ఆమెక్కూడా అదే అనుమానమొచ్చింది.

ఒకవేళ ఆమె రాకపోతే, తను వంటరిగా వెళ్ళాలా అని లోపల గుబులుగా అనిపించింది. అది బయటికి కనబడితే తండ్రి ఉద్యోగానికి వెళ్ళనీయడని భయం వేసింది.

"లోపల ఉంటారులే నాన్నా . బయట నిలబడరు కదా."

వెళ్ళకుండా అక్కడే నిలబడ్డ నర్సింహుల్ని చూసి,

"నాకేం కాదు నాన్నా. నువ్వు జాగ్రత్తగా ఊరికెళ్ళు. దిగులు పడకూ." తండ్రికి ధైర్యం చెప్పింది.

ఏజెంట్ పంపిన టికెట్ , పాస్ పోర్ట్ ని గట్టిగా పట్టుకుంది. బాగ్ లోపల ఉన్న ఎంప్లాయ్మెంట్ ఆఫర్ లెటర్ ని పదే పదే చూసుకుంది.

తన ఫ్రెండ్ వాళ్ల పిన్ని ఎక్కడా కనిపించలేదు. ఫ్లయిట్ లో కూర్చునే వరకూ ఆమె కోసం వెతుకుతూనే ఉంది లిల్లీ. భయానికి ఓపిక తక్కువ. ఎంతో కాలం నెత్తి మీద కూర్చోలేదు. కాసేపటికి ఎటు పోతుందో పోతుంది, ఇంకెవడి నెత్తినో ఎక్కడానికి.

మొదటి సారి ఎయిర్ పోర్ట్ అనుభవం, పైగా ఇంటర్నేషనల్ ప్రయాణం, ఎలా ఉంటుందంటే ఈతరానివాడు సముద్రంలో పడినట్లుంటుంది.

ఇమ్మిగ్రేషన్ దాటి వచ్చాక గానీ తెలియదు, ఒడ్డుకు కొట్టుకొచ్చి పడడానికి ఈత రానవసరం లేదని.

ఇమ్మిగ్రేషన్ దగ్గర వేరే వరుసలో ఆ దేశపు ఆడవాళ్ళున్నారు. శరీరాన్నంతా నల్లని దుస్తులతో కప్పుకుని నిలబడ్డారు. వాళ్ళని చూశాక, తను సరిగా దుస్తులు వేసుకోనట్టనిపించింది లిల్లీకి. తన వంటిమీద కూడా అలాంటిదేదో ఉంటే  గానీ మర్యాదగా ఉండదనిపించి ముడుచుకుపోయింది.

తనతో బాటు , ఉద్యోగానికి వచ్చిన ఇంకా పదిహేను మంది అమ్మాయిల్ని“ఫస్ట్ టైం?” అని అడిగి ఆపేశారు.

'ఏమిటి? లోకంలో ఇంత సైజు మనుషులు కూడా ఉంటారా?' అనిపించేంత భారీ కాయంతో  ఒక పోలీసు వచ్చాడు.

ఒక పేపర్ కార్టన్ నుండి, నుండి తినే పదార్థాలను చేతిలో తీసుకుని తింటున్నాడు. అతని చేతినిండా  నూనె, ఉప్పు, అంటుకుని కనిపిస్తున్నాయి. అక్కడే ఉన్న ఫ్రిజ్ నుండి కోక్ టిన్ తీసి తాగుతూ, వేరే పోలీసులతో  అరబిక్ లో మాట్లాడుతున్నాడు. ఆడపిల్లల గుంపు ని చూసి తలకాయలు లెక్క పెట్టాడు. తను పట్టని కుర్చీలో సర్దుకుని కూర్చుని ఒక్కొక్కరి పాస్ పోర్ట్ అడిగి చూస్తున్నాడు. లిల్లీ పాస్పోర్ట్ చూసి పక్కన పెట్టబోతుంటే లిల్లీ తన చేతితో దాన్ని తీసుకోబోయింది. అమె చేతి మీద చెయ్యి వేసి అదిమి పెట్టాడు.

బలంగా చెయ్యి అదిమి పెట్టడంతో భయంగా చూసి చెయ్యి లాగేసుకుంది. పాస్ పోర్ట్ తీసుకోవద్దని కళ్ళతో చెప్తూ, తల అడ్డంగా ఆడించాడు. పాస్ పోర్టులన్నింటినీ ఒక కవర్ లో వేశాడు.

వారందర్నీ , ఒక లైనుగా తీసుకెళ్ళి పెద్ద వాన్ ఎక్కించాడు. పాస్ పోర్టులున్న కవర్ డ్రైవర్ కు ఒప్పజెప్పి ఏదో చెప్పాడు.   అప్పటికి అర్థ రాత్రి  దాటి మూడయ్యింది. విశాలమైన రోడ్ల మీద మనుషులేలేరు. వాన్ వెళ్తున్న శబ్దం తప్ప. వాన్ లో ఉన్న ఆడవాళ్ళు కూడా ఎవరూ ఎవరితోనూ మాట్లాడుకోవడం లేదు. అందరిలోనూ ఏదో భయం . ఎక్కడికి తీసుకెళ్తారు?

పావుగంట ప్రయాణం తర్వాత ఒక బిల్డింగ్ ముందు ఆగింద్ వాన్.

అదొక చక్కటి గెస్ట్ హౌస్. ఉద్యోగాల కోసం వేరే దేశాలనుండి వచ్చే స్త్రీలు దిగడానికి ఏర్పాటు చేశారు. వాళ్ళ దేశపు ఆచారాలప్రకారం కట్టిన బంగళా. బయటి నుండి చూస్తే అంతా మూసేసినట్లు ఉంది. ఎత్తైన ఇనపగేటు. లోపల పాలరాతి ప్రాంగణం మధ్యలో నీళ్ళ ఫౌంటైన్ ఉంది. అక్కడక్కడా పూల చెట్ల కుండీలు ఉన్నాయి.

అన్ని ఫార్మాలిటీస్ పూర్తి చేసుకుని , పోస్టింగ్ ఎక్కడో తెలిసి,  ఆ ఊరికి చేరుకునే సరికి రెండు మూడు రోజులు పడుతుంది. ఆ కొద్ది కాలం ఆడపిల్లలుండేందుకు కట్టిన బిల్డింగ్,  అన్ని సదుపాయాలతో చాలా అధునాతనంగా ఉంది.

అదే కాంపస్ లో గెస్ట్ హౌస్ కి ఆనుకుని నర్సింగ్ హాస్టల్ ఉంది. అదొక మూడంతుస్తుల మేడ. హాస్టల్ లో ఒక రూముకు ఇద్దరు నర్సులు చొప్పున ఉండాలట. సీనియర్ నర్సులు,  వ్యక్తిగత స్వేచ్ఛకోసమై ఒక్కొక్కరూ ఒక్కో రూం తీసుకున్నారు. హాస్టల్ చాలక,  గెస్ట్ హౌస్ లోని ఆరుగదులు కూడా ఆక్రమించుకున్నారు.

నర్సింగ్ హాస్టల్ కూ, గెస్ట్ హౌస్ కూ ఒకరే సంరక్షకురాలు. ఆమె గది గెస్ట్ హౌస్ బయట వరండాలో ఉంది. ఆవిడ ఊరెళ్ళిందిట. తలుపులు తీయడానికి సీనియర్ నర్సులొచ్చారు. అర్థ రాత్రి కొత్తగా వచ్చిన పదిహేను మంది అమ్మాయిలనూ రిసీవ్ చేసుకున్నారు. ఎవర్ని చూసినా నయనతారంత అందంగా, ఆమెకన్నా పొడుగ్గా ఉన్నారు. మళయాళం లో ఏదో మాట్లాడుకున్నారు. ప్రతివారి గొంతూ ఎంతో శ్రావ్యంగా ఉంది.

వారికి వసతి ఎక్కడ ఎక్కడ చూపించాలా అని ఆలోచించి, సెక్యూరిటీ గా పనిచేసే స్త్రీ ఉండే రూం తాళాలు తెరిచి “ఆమె రెండు రోజులకు కానీ రాదు. ఇంతలో మీ పోస్టింగ్ అది రెడీ చేస్తారు. అందాకా ఇక్కడ ఉండండి.” అని చెప్పి వారి వారి గదుల్లోకి  వెళ్ళి తలుపులు వేసుకున్నారు.  వారాక్రమించేసిన గదుల్లోకి రానివ్వడం బొత్తిగా ఇష్టం లేని పని.

సెక్యూరిటీ గార్డ్ రూమంటే, రూం లా లేదు. విశాలమైన హాలు. రెండు డబుల్ బెడ్స్ ఉన్నాయి. రెండు పెద్ద సోఫాలు, నాలుగు చిన్న సోఫాలున్నాయి. బెడ్స్ మీద, సోఫాల మీద అందరూ అడ్డ దిడ్డంగా పడుకున్నారు.. కొందమంది నేల మీద చాపలు పరుచుకుని పడుకున్నారు. లిల్లీ వెళ్లే సరికి ఎక్కడా చోటు లేదు. తన పెట్టెలో ఉన్న దుప్పటి తీసుకుని బయటికి వచ్చింది.

వరండాలో పెద్ద ఇనప పెట్టె ఉంది. దాని మీద పడుకుంది. ఎడారి చలికి, పెట్టె చల్లగా ఉంది. దాని మీద పడుకుని ఆకాశం వంక చూసింది. ఆకాశంలో అన్నీ తెలిసిన నక్షత్రాలు కనిపించాయి.

ఇక్కడ నాలుగైంది అంటే అక్కడ ఆరుదాటి ఉంటుంది.

నాన్న కు మెలకువ వచ్చేసి ఉంటుంది.

ఆలోచిస్తూ ఉంటే నిద్రపట్టింది.

రెండ్రోజుల తర్వాత వస్తుందనుకున్న సెక్యూరిటీ ఉద్యోగి తెల్లవారగానే వచ్చేసింది.

తన రూం తలుపులు తీసి ఉండడం, గది నిండా అడ్డ దిడ్డంగా నిద్రపోతున్న ఆడపిల్లల్ని చూసింది.

చేతిలో ఉన్న కర్రతో లిల్లీ పడుకున్న పెట్టె పై కొట్టి అరబిక్ లో ఏదో అన్నది. కళ్ళు మూసుకుని గొంతు వింటే ఆవిడ ఆడమనిషి అనుకోవడం కష్టం. ఆమె దుస్తులు విచిత్రంగా ఉన్నాయి.

వెంటనే లేచి కప్పుకున్న దుప్పటి మడతలు వేసి మూలగా నిలబడ్డది.

నడివయసు దాటినట్లున్నది. మనిషి చాలా పొడుగు. చందమామ కథల్లో మంత్రగత్తె లా ఉంది ఆమె ఆకారం. ముఖం లో కూడా అదే తరహా కాఠిన్యం.

బయటికి వచ్చి పై అంతుస్తుల వైపు చూస్తూ కోపంగా అరబిక్ లో పెద్దగా అరుస్తోంది ఆమె.

ఆ అరుపులు విని పై నుండి సన్నగా పొడుగ్గా ఉన్న ఒక మళయాళీ నర్స్ వచ్చింది.నాజూకు నైటీ వేసుకుని, పొడుగాటి జుట్టుని కొప్పులా చేసి నెత్తిమీద క్లిప్ పెట్టుకుంది. కాళ్లకు సొగసైన స్లిప్పర్స్ వేసుకుంది. మునివేళ్ళతో నైటీ పైకి పట్టుకుని మెట్ల మీద నడుచుకుంటూ వచ్చింది.

వంటికి ఏదో క్రీం పట్టించినట్లుంది. చక్కటి పరిమళంతో గది నిండింది. పాదాల్లో ఒక దానికి మాత్రమే, సన్నటి బంగారపు చెయిన్ ఉంది.

వచ్చీ రాని అరబిక్ లో ముసలమ్మకు ఏదో వివరించబోయింది.

ముసలమ్మ అరిచింది.

చేచి, కూల్ గా ఇంకేదో చెప్పింది.

ముసలమ్మ కోపం భగ్గుమంది. విపరీతమైన కోపంతో చేతికందినవి బయట పడేస్తూ పెద్దగా అరుస్తోంది.

ఉద్యోగాలకోసం వచ్చేవారిని ముసలమ్మ గదిలో ఉంచుతున్నారు. ప్రతి వారం ఒక కొత్త బాచ్ దిగడం, తన రూంలో మకాం వెయ్యడం ఇదంతా ముసలమ్మ ఆగ్రహానికి కారణం.

కొత్తగా వచ్చిన పిల్లలందరూ భయపడిపోయారు. ఒక పావుగంట అరిచాక ఆవిడకు కోపం తగ్గినట్టుంది. అరచి అరచి లోపలికి వచ్చి వంట చేసుకుని తిని నిద్రపోయింది.

ఇంతలోకి డ్యూటీ నుండి వచ్చిన నర్సులు భోజనాలు తెచ్చారు. అప్పటివరకూ జరిగిన గొడవ మర్చిపోయి అంతా కలిసి గెస్ట్ హౌస్ లో ఉన్న డైనింగ్ టేబిల్ మీద భోజనం చేసారు. ఎక్కువ నాన్ వెజిటేరియన్. .

పైనుండే సీనియర్ మళయాళీ చేచీలు చెప్పడం ఏమిటంటే "ముసల్దాని రూం కూడా మనదే. ఆవిడ ఆక్రమించుకున్నది. కనక మీరు విచ్చలవిడిగా వాడుకోండని" చిట్టి చేచిలకు బోధించారు. అవి వంట పట్టించుకున్న కొత్త పిల్లలు,ఆ గదిని ఇష్టం వచ్చినట్టు వాడుకుంటూ, వస్తువులు చిందర వందర చేస్తున్నారు. ఆవిడ అరబిక్ లో తిడుతూనే ఉంది. భాష అర్థం కాకపోతేనేమి, భావం అర్థం అవుతుంది కదా. ఆవిడ తిట్టగానే , వెంటనే ఇంటికి ఫోన్ చేస్తూ ఏడుస్తున్నారు.

ఉద్యోగం లో చేరే వరకూ లిల్లీ మనసు మనసులో లేదు. వరండాలో ఇనపపెట్టె మీద కూర్చుని ఎటో దీక్షగా శూన్యంలోకి చూస్తూ ఉంటుంది. భోజనానికి కూర్చోదు. మాటలకూ కలవదూ. ఒంటరిగా వరండా లో పెట్టె మీద కూర్చుని మౌనంగా కూర్చుంటోంది. అందరూ భోజనాలు అయినాక పేకాట ఆడుతున్నారు.

రెండు రోజులు గడిచాయి. మర్నాడు ఉదయాన్నే వాన్ వస్తుంది. మినిస్ట్రీ ఆఫీసుకు వెళ్ళాలి. తన ఉద్యోగం ఎక్కడో, ఏ హాస్పిటల్ లో వేశారో వివరాలు తెలిసే రోజు. ఆ రాత్రి లిల్లీకి నిద్రపట్టలేదు. తెల్లవారు జామున మూడింటికే మెలకువ వచ్చింది. ఆ రెండు రోజులూ వరండాలోని ఇనప పెట్టె మీదే నివాసం. మెల్లగా లేచి తన బట్టలూ, వస్తువులూ సర్దుకుని కూర్చుంది. అయిదయింది. ఏడయ్యింది. తెల్లవారిపోయింది. పదకొండయినా వాన్ రాలేదు.

తర్వాత తెలిసింది. ఆఫీసుకు ఇంకేవో సెలవలొచ్చాయని, ఇంకా రెండు రోజులు లేటవుతుందని.

రెండు రోజుల సెలవలూ అయిపోయాయి.

రేపటి ఉదయమైనా వాన్ వస్తుందా?

రాకపోతే?

అసలు ఉద్యోగాలనేవి ఉన్నాయా?

చేతిలో పాస్ పోర్ట్ కూడా లేదు. ఇదంతా నిజమేనా?

తనకేదైనా అయితే, నాన్న ఏమైపోతాడు. ఆలోచిస్తూ కూర్చుంది లిల్లీ.

అమ్మాయిలందరూ క్షణాలు లెక్కపెడుతూ ఎదురుచూసిన వాన్, ఆరోజు ఉదయాన్నే వచ్చింది. అందరికీ వేరే వేరే ఊళ్ళలో పోస్టింగ్ వచ్చింది.

ఆఫీసుకెళ్ళాక అందరికీ ఒకే ఊరు, ఒకే హాస్పిటల్ అయితే బాగుండనుకున్నారు. వేరవుతున్నందుకు బాధ పడ్డారు. ఆ నాలుగురోజుల్లోనే ఎంతో కొంత స్నేహితులయ్యారు

ఆ రోజు మధ్యాహ్నం గెస్ట్ హౌస్ కి తిరిగి వచ్చారు. రోజు అందరూ చాలా ఆనందంగా ఉన్నారు. ఉద్యోగాలొచ్చేశాయి. పై అంతస్తులో ఉన్న సీనియర్ అక్కలతో కూర్చుని తమకు పోస్టింగ్ వచ్చిన హాస్పిటల్ వివరాలు చెప్పి, ఆ ఊరి విశేషాలు చెప్పమని సతాయిస్తున్నారు. సంతోషంగా, ఇళ్లకు ఫోన్లు చేసి చెప్పారు.

ఆ మర్నాడు కొత్త ఊరికి వెళ్తారు. రోజు ఎనిమిదిగంటల పని. వారానికి రెండు రోజులు సెలవలు. మంచి జీతం.

అమ్మాయిలందరూ డైనింగ్ టేబుల్ మీద కూర్చుని, గోలగోలగా నవ్వుకుంటూ భోజనం చేస్తున్నారు. లిల్లీకి ఆకలి గా అనిపించింది. అందరితో కలిసి తినడానికి కూర్చుంది. టేబుల్ మీద పెద్ద పెద్ద రొట్టెలున్నాయి. అవి తుంచడానికెంతో బలం కావాలి. రెండు ముక్కలు తుంచే సరికే చేతులు నొప్పెట్టాయి. పక్కనే మసాలా లేని చప్పటి చికెన్ పులుసు. ఏమీ తినాలనిపించలేదు.

మళ్ళీ వచ్చి పెట్టె మీద కూర్చుంది. ఈ గెస్ట్ హౌస్ నుండి రేపెళ్ళిపోతుంది. ఉద్యోగం లో చేరుతుంది. హాస్టల్ లో రూం ఇస్తారు.

కడుపులో ఏదోగా ఉంది. అది ఆకలి కాదేమో. అనుకుంటూ పక్కకు తిరిగి కాళ్ళు ముడుచుకుని పడుకుంది.

భుజం మీద చెయ్యి పడితే తలెత్తి చూసింది. గది లో నుండి సెక్యూరిటీ ఉద్యోగి లిల్లీ పక్కనే నిలబడి ఉంది. తనేదో తప్పు చేసి ఉంటుందని, ముసలావిడ నిలదీయడానికి వచ్చి ఉంటుందని , గభాల్న పెట్టె మీంచి దూకి నిలబడింది.

లోపలి వాళ్లని చూపెట్టి ఏదో అన్నది.

'వాళ్లంతా తింటుంటే , నువ్వు తినవేంటీ?' అన్నట్టు .

వద్దని తల అడ్డంగా ఊపింది. అక్కడే ఉంటే ఆమెకు కోపం వస్తుందేమోనని అందరూ కూర్చున్న చోటికి వెళ్ళబోయింది . కూర్చోమన్నట్టు భుజమ్మీద చెయ్యి వేసి నొక్కి కూర్చోబెట్టింది.'కొంచం ఆగు' అన్నట్టు సైగ చేసి లోపలికి వెళ్ళి నల్లని మూకుడు తెచ్చి ఆమె ముందు పెట్టింది. అందులో లావుగా ముతక బియ్యంతో వండిన అన్నం, నల్లగా కాల్చిన చేప ఉన్నాయి. అన్నం నీళ్ళ నీళ్ళగా ఉంది .

ఆవిడ పెట్టినవేవీ తినగలిగేవి కాదు. అవి కాదనగలిగే వీలూ లేదు.

లోపలికి ఒక్క మెతుకు కూడా వెళ్ళనంటోంది. అరబిక్ లో మాట్టాడుతూ లిల్లీ పక్కనే పెట్టె మీద కూర్చుంది. పులి, స్నేహంగా పలకరించి పక్కన కూర్చున్నట్టుంది లిల్లీకి. ఏమీ తినకుండా ఆమె వంక దొంగ చూపులు చూస్తూ, తనలో తాను ముడుచుకుపోతోంది

“ఇది తినూ” అని మూకుడులో ఉన్న చేపని చూపించి, “బాగుంటుంది తినమంది.” ముసలమ్మ మొహంలో కోపం లేదు. అలా అని నవ్వు కూడా లేదు.

తనకు చేపలు, ఆ వాసనా పడదు. వద్దన్నట్టు తలూపింది. ఆకలి లేదంది. ఎవరి భాషలో వాళ్ళు మాట్లాడుతున్నారు. ఒకరి భాష ఇంకొకరి తెలియదు కానీ , ఇద్దరికీ అర్థమైపోతోంది.

పెట్టినవి తిననందుకు ఆమెకు కోపం వస్తుందేమోనని భయపడుతూ చూసింది., లిల్లీ పక్కనే కూర్చుని , తన చొక్కా కు అద్దాలు కుట్టుకుంటోంది. ఏదో కూని రాగం తీస్తోంది.

ఆవిడ వేసుకున్న బట్టలు విచిత్రంగా ఉన్నాయి. పొడుగాటి అంగీ వేసుకుంది. అంగీ పైన కోటులాంటిది ఉంది. కింద లుంగీలా ఉన్న పరికిణీ లాంటిది వేసుకుంది. ఎక్కడ చూసినా అద్దాలు, గవ్వలు, పూసలు గందరగోళంగా కుట్టి ఉన్నాయి. తలకు ఒక శాలువాలాంటిది చుట్టుకుంది. మధ్యలో కుట్టడం ఆపి పైవాళ్ళను చూపిస్తూ ఏదో చెప్పింది. లిల్లీకి అరబిక్ రాకపోతేనేమి, ఆ నర్సులెంత గడుసువాళ్ళో తెలిసిపోయింది.

కాసేపటికి ముసలమ్మ లోపలికి వెళ్ళి పడుకుంది. ఆవిడ నిద్రపోయాక ఆ చేప, అన్నం ఉన్న ప్లేట్ ఫ్రిజ్ లో పెట్టింది.

మరుసటి రోజు ఉదయాన్నే లేచి తయారయింది. తనను ఊరికి తీసుకెళ్ళే వాన్ వచ్చింది. తన సామాను తీసుకెళ్ళి వాన్ లో పెట్టింది. త్వరగా రమ్మనమని డ్రైవర్ హడావుడి చేస్తున్నాడు. ఒక్క నిముషం అన్నట్టు అతనితో చెప్పి లోపలికి వెళ్ళింది. ముసలమ్మతో వెళ్తున్నానని చెప్పింది.

ఆమె లిల్లీ తలపై చేత్తో రాసింది. ముఖంలో నవ్వు లేదు. కఠినమైన పదాలతో అర్థం కాని అరబిక్ భాషలో ప్రార్థన చేసింది. లిల్లీకి అంతా మంచే జరగాలని కోరుకుంటూ.

ఫ్రిజ్ లోంచి నిన్నటి చేపనూ, అన్నాన్నీ, ఒక డబ్బాలో వేసి ఇచ్చింది. 'ఊరెళ్ళాక తప్పకుండా తినాలట.' చెప్పింది.

లిల్లీ తలూపింది.

ఉద్యోగంలో చేరాక చేప, దుడ్డు బియ్యపు అన్నం ఉన్న డబ్బాని ఫ్రిజ్ లో పెట్టింది.

" నువ్వెటూ ఫిష్ తినవు. ఇవి ఎందుకు దాస్తున్నావో తెలియదు" అని తోటి నర్సులు కోప్పడి పారేసే వరకూ, చాలా రోజుల పాటు వాటిని ఉంచింది లిల్లీ.

***

పైన చెప్పిన లిల్లీయే నా బెస్ట్ ఫ్రెండ్. మా యూనిట్ లో శ్రద్ధగా పనిచేసే నర్స్.

నాకు బెస్ట్ ఫ్రెండ్ ఎలా అయిందంటే, డాక్టర్ తన వృత్తిలో,"డాక్టర్ ఇది మరచిపోయావు. ఇక్కడ తప్పుచేస్తున్నావు" అని నర్స్ ఎత్తి చూపితే ఆమె మీద కక్ష పెంచుకోగూడదట. 'నువ్వేంటి నాకు చెప్పేది' అని చిన్నబుచ్చకూడదట. ఆమెని మన బెస్ట్ ఫ్రెండ్ అనుకోవాలట.

పేషంట్ కు ట్రీట్ మెంట్ ఇచ్చే సమయంలో నిమగ్నమైతే తప్ప ఆ పొరపాట్లు కనపడవు. అలా ఎంతో నిజాయితీగా పనిచేసే నర్సులున్నారు. వాళ్ళ నుండి ఫోన్ వస్తే అదొక వార్నింగ్ బెల్ లాంటిది.

లిల్లీ ఎన్నో సార్లు, అలా వార్నింగ్ బెల్ కొట్టి, నాకు బెస్ట్ ఫ్రెండ్ అయింది.

ఓ అరగంట తర్వాత ఒక డబ్బాతో తిరిగి వచ్చింది. ఆ డబ్బాలో ఉన్న భోజనం తీసి ప్లేట్ లో పెట్టింది.

అప్పుడే కాల్చి తెచ్చిన చేప వేడిగా ఉంది. లిల్లీ చెయ్యి ఊదుకుంటూ కొద్ది కొద్దిగా తీసి ముళ్ళు లేకుండా తీసి పెడుతోంది. బాగా ముతక బియ్యంతో వండిన అన్నం. మరియం భోజనం ప్లేటు చూడకుండా ఆ డబ్బాని అటూ ఇటూ తిప్పి చూసింది. అది తనదేనని గుర్తుపట్టింది.

పరిచయమైన డబ్బా, ఇష్టమైన ఆహారం!

లిల్లీ బతిమలాడుతూ పెడుతుంటే, డబ్బాని తిప్పి తిప్పి చూసుకుంటూ భోజనం చేసింది మరియం.

కానీ లిల్లీని మాత్రం గుర్తుపట్టలేదు మరియం.

అందుకు తనేమీ బాధపడదని నాకు తెలుసు.

లిల్లీని ఎన్నాళ్ళనుండో చూస్తున్నాను.

పేషంట్ సుఖంగా ఇంటికెళ్తే చాలనుకుంటుంది. తనకే గుర్తింపూ కోరుకోదు.

ఎడారిలో పరిమళించిన మల్లి, లిల్లీ.

Post your comments